క్లుప్తంగా

సేవలు అభినందనీయం



సిమెంట్ బెంచీలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్ : సామాజిక సేవల్లో వాసవి క్లబ్ గోల్డ్ యూత్ ముందు వరుసలో ఉంటూ ప్రజలకు విశేష సేవలు అందిస్తోందని ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. ఏలూరు వాసవిక్లబ్ గోల్డ్ యూత్ ఆధ్వర్యంలో ఏలూరు కోటదిబ్బ సీసీఎస్ పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు, ప్రజలకు కూర్చొనేందుకు రెండు సిమెంట్ బెంచీలను అందజేశారు. ఈ రెండు సిమెంట్ బెంచీలను సీసీఎస్ సీఐ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ గోల్డ్ యూత్ మరింత విస్తృతంగా సేవలు అందిస్తూ ప్రజలకు అండగా ఉండాలని ఆకాంక్షించారు.

గురువులకు సత్కారం



గురువులను సత్కరిస్తున్న పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సంస్థ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన ది ఏలూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక సంస్థలకు చెందిన గురువులను ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక అంబికా దేవి ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ నుంచి కోరుకొండ కాశీ విశ్వనాథం, కోరుకొండ కాశీ అన్నపూర్ణ, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు శాఖ కో–ఆర్డినేటర్ బీకే లావణ్య, సత్యసాయి సేవా సంస్థల నుంచి ఎడ్లమూడి విమల, ఇన్నర్ వీల్ క్లబ్ నుంచి నున్న వెంకట గంగాభవాని, బాలవికాస్ టీచర్ డి.శ్రీలక్ష్మిలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. కూర్మాల లక్ష్మి, నామగిరి మంజులత, కొల్లి త్రినాధ్ ఫణి, కొండాల మౌర్య జనార్థన రూన్సీ, కనకాల వరలక్ష్మి, నున్న సావిత్రి పాల్గొన్నారు.

రేపు మహాధర్నా

ఏలూరు (టూటౌన్) : పోలవరం నిర్వాసితుల సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి తెలిపారు. విజయవాడలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వరుణుడి కోసం ఎదురుచూపులు

- దోబూచులాడుతున్న రుతుపవనాలు
- మండుతున్న ఎండలతో బీడు వారుతున్న చేలు
- అయోమయంలో రైతన్నలు



వెంకటాపురంలో రైతులు దుక్కిదున్నిన పంటచేలు

ఏలూరు రూరల్ : ఏలూరు మండల గ్రామాల్లో ఖరీఫ్ సాగుపై రైతుల ఉత్సాహం ఆవిరైపోయింది. వర్షాకాలం వచ్చినప్పటికీ రుతుపవనాలు దోబూచులాడుతున్నాయి. కొద్దిరోజులుగా గ్రామాల్లో వర్షాలు కురువడం లేదు. మరోపక్క ఎండలు మండుతుండడతో పంటచేలు బీడుగా మారిపోతున్నాయి. ఇప్పటికే రైతులు చేలను దుక్కిదున్ని సిద్ధం చేసుకున్నారు.

నారు పోయాలా. వద్దా

వర్షాల జాడ కానరాకపోవడంతో రైతులు అయోమయంలో పడిపోయారు. ఖరీఫ్‌కు అవసరమైన నారు పోయాల వద్దా అని ఆలోచిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం కృష్ణా కెనాల్ నుంచి సాగునీరు విడుదల చేసినప్పటికీ గ్రామాలకు అరకొరగానే చేరాయి. దీంతో రైతులు వర్షాలపైనే ఆశలు పెంచుకున్నారు. కాలువనీరుతో పాటు విస్తారంగా వర్షాలు కురిస్తేనే ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని భావిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం చొదిమెళ్ల, మల్కాపురంలో రైతులు ఉత్సాహంగా నారు పోశారు. కానీ వర్షాలు కురవకపోతే నారు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ఏలూరు మండలం టెయిల్ ఎండ్

ఇటు కృష్ణా, అటు గోదావరి కాలువకు ఏలూరు మండల గ్రామాలు టెయిల్ ఎండ్ కావడంతో రైతులు ఎంతోకాలంగా సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఎగువ ప్రాంతాల కాలువలు, చెరువులు నిండుకున్న తర్వాతే ఏలూరు మండలానికి నీరు చేరుతోంది. దీనివల్ల ఏటా రబీతో పాటు ఖరీఫ్ సైతం రైతులు ఆలస్యంగా ప్రారంభిస్తున్నారు.



కొత్తూరు రోడ్డులో పంటకాలువ నుంచి నారుకు నీరు మళ్లిస్తున్న దృశ్యం



కొత్తూరుకాలనీ వద్ద నీరు లేక వెలవెలబోతున్న పంట కాలువ

వారంరోజుల క్రితం ఇరిగేషన్ అధికారులు కృష్ణా కెనాల్ నుంచి విడుదల చేసిన సాగునీరు నేటికీ గ్రామాల్లో శివారు ప్రాంతాలకు చేరలేదు. ఇరిగేషన్ ఏఈ సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు లస్కర్లు పాందురంగా థియేటర్ వద్ద జాలిపూడి డ్రెయిన్ నుంచి మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి గ్రామాలకు నీటిని విడుదల చేశారు. ఇదే క్రమంలో పెద్ద రైల్వే స్టేషన్, తూర్పులాకుల వద్ద స్లూయిజ్ నుంచి మల్కాపురం, కొమడవోలు, చాటపర్రు తదితర గ్రామాలకు వదిలారు. గ్రీన్‌సిటీ, ఎన్టీఆర్ కాలనీ తదితర స్లూయిజ్ నుంచి పోణంగి పరిసర ప్రాంతాల్లో కాలువకు వదిలారు. పడమట లాకుల నుంచి విడుదల చేస్తున్న నీరు పోణంగి ఎగువ ప్రాంతాలకు పారుతోంది. అయితే కాలువ నీటి మట్టం తగ్గిపోవడంతో రైతులు పూర్తిస్థాయిలో సాగుకు సిద్ధం కావడం లేదు.

8–9 వేల ఎకరాల్లో వరిసాగు

మండలంలో సుమారు 8 నుంచి 9 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టనున్నారని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది రబీలో సాగునీరు లభ్యత లేకపోవడంతో అధికారుల సూచనల మేరకు రైతులు 6,223 ఎకరాల్లో వరితో పాటు అపరాలు సాగు చేశారు. ఇందులో చాటపర్రు, మాదేపల్లి, కాట్లంపూడి, జాలిపూడి ప్రాంతాల రైతులు 4,549 ఎకరాల్లో అపరాలు మాత్రమే పండించారు. వెంకటాపురం, చొదిమెళ్ల, తంగెళ్లమూడి, సత్రంపాడులో బోర్ల కింద 1,674 ఎకరాల్లో మాత్రమే వరి సాగు జరిగింది. ఇప్పుడు విస్తారంగా వర్షాలు కురిస్తే అన్ని గ్రామాల రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమౌతున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీకి సత్కారం



జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు (మెట్రో) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులను ఆదివారం దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో పూలబొకెలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పద్మశ్రీ చైర్‌పర్సన్‌గా ఇటీవల పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయంలో ఈ సత్కారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గౌడ కులస్తుల ప్రేమాభిమానాలకు తాను కట్టుబడి ఉంటానని, వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గం గౌడ సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ ఏఎంసీ చైర్మన్ తాతా సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, దెందులూరు నియోజకవర్గం గౌడ సంఘం అధ్యక్షులు పులిచెర్ల నాగబాబు, సంఘం అధికార ప్రతినిధి, దెందులూరు మండల సచివాలయాల కన్వీనర్ కట్టా ఏసుబాబు, కోశాధికారి బెజవాడ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు వేగవంతం



ఏలూరు వన్‌టౌన్ అరుంధతీ పేట ప్రాంతంలో వేగంగా సాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు

ఏలూరు టౌన్ : ఏలూరు వన్‌టౌన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా తయారవుతుంది. గతంలో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. కానీ అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వ హయాంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు తూతూమంత్రంగానే చేసి ముగించారు. కానీ సమస్యకు పరిష్కారం లభించలేదు. ఇక కోర్టు కేసులు ఇతర సమస్యలతో పనులు అటకెక్కాయి. ఇటీవల ఈ పనులు చేసేందుకు మరోసారి అవకాశం రావటంతో ఎమ్మెల్యే ఆళ్ల నాని నిధులు కేటాయించి పనులు ప్రారంభింపజేశారు. ఈ పనులతో ఆయా ప్రాంతాల్లోని ప్రజల పడుతున్న ఇబ్బందులకు తెరపడినట్లేనని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1 కోటితో పనులు

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని అరుంధతీపేట, వైఎంహెచ్‌ఏ హాలు, రామకోటి, గంగానమ్మ గుడి ప్రాంతం, వెంకన్న చెరువు ప్రాంతాల్లో ప్రస్తుతం అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేపట్టారు. ఈ ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్యల తీవ్రంగా ఉండడంతో వాటిని పరిష్కరించేందుకు ఏలూరు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. సుమారుగా 670 మీటర్ల మేర డ్రెయినేజీ పనులను ఏలూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ప్రారంభించారు. గతంలో వేసిన పాత అండర్‌గ్రౌండ్ పైప్ లైను 15 అడుగుల లోతులో ఉండగా , వాటిని అదేవిధంగా పనిచేసేలా ఉంచేస్తూ... కొత్తగా వాటిపైన 14 అడుగుల లోతులో మరో పైప్‌లైన్ వేస్తున్నారు. పాతలైన్లు పాక్షికంగా పనిచేసినా.. కొత్తలైన్ పూర్తిస్థాయిలో పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తుందని అధికారులు చెబుతున్నారు.

ప్రజల సమస్య తీరుతుంది



ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో ఎప్పటి నుంచో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సమస్య ఉంది. గతంలో ఎమ్మెల్యే ఆళ్లనాని చొరవతో నిధులు మంజూరు చేయించినా టీడీపీ హయాంలో ఆ నిధులను సరిగా వినియోగించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం మరోసారి కొన్ని చోట్ల డ్రెయినేజీ పైపులైన్ వేయటం ద్వారా అరుంధతీపేట తదితర ప్రాంతాల్లోని ప్రజల సమస్య పరిష్కారం అవుతుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని నాయకత్వంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– జిజ్జువరపు విజయనిర్మల, 16వ డివిజన్ కార్పొరేటర్, ఏలూరు

చంద్రబాబు తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి



ఏలూరు పార్టీ జిల్లా కార్యాలయంలో అనుబంధ సంఘాల నేతలతో సమావేశంలో ఆళ్లనాని

- వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల నేతలతో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమీక్ష

ఏలూరు టౌన్ : రాష్ట్రంలో ప్రతి పేదవాడికి మేలు జరిగేలా అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ దేశానికే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ అనుబంధ సంఘాల నేతలు అండగా నిలవాలని.. చంద్రబాబు తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆళ్ల నాని చెప్పారు. ఏలూరు ఆర్ఆర్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో ఆయన ప్రత్యేకంగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఏలూరు జిల్లాలో నూతనంగా నియమితులైన పార్టీ అనుబంధ సంఘాల నేతలు, ప్రస్తుతం బాధ్యతలు చేపడుతున్న నాయకులతో ఆయన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మరింత ప్రేమ పెంచుకుంటున్నారనే బాధతో చంద్రబాబు, దుష్ట చతుష్టయం సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వారికి రాబోయే ఎన్నికల్లో జనం సరైన రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ ప్రజలను రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉపన్యాసాలు ఇస్తూ రాజకీయ పరిణితి లేదని నిరూపించుకుంటున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాను మరింత బలోపేతం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఏమి చేస్తుందో అవగాహన కల్పించాలని, చంద్రబాబు హయాంలో ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఎలా మోసం చేశారో ప్రజలకు వివరించాలని సూచించారు. సమీక్షలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, ఏలూరు జిల్లాలోని అనుబంధ సంఘాల నేతలున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	90	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07-10
బెండకాయలు	30	కంద	46
పచ్చిమిర్చి	80-100	బీట్‌రూట్	40
కాకర కాయలు	58	కీరా దోస	60
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	130-220
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	20-35
క్యారెట్	38	పాలకూర	12
దొండకాయలు	36	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	22	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	18-22	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	15
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	19
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	05
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	12
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	28
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు –తిరుపతి	16.00	4830	28

7న చలో హైదరాబాద్ సన్నాహక కార్యక్రమం



కంద్రిగగూడెంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఈ నెల 7వ తేదీన నల్లజర్ల మండలం అంకన్నగూడెంలో నిర్వహించే చలో హైదరాబాద్ సన్నాహక కార్యక్రమాన్ని, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక కంద్రిగగూడెం సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ కాశీ కృష్ణ మాట్లాడుతూ ఈ నెల 7న అంకన్నగూడెంలో జరిగే కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు చెప్పారు. రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాబోయే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా ఐక్యంగా ఉండి సత్తా చూపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు నమ్మిన లక్ష్మి, ఎంఎస్‌పీ నాయకులు అయినపర్తి మాధవరావు, ఏలూరు నగర మాజీ అధ్యక్షులు గూడూరు రాజేష్, యువ నాయకులు నమ్మిన నాగార్జున, తిరుగుదల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే బీసీలకు రాజ్యాధికారం

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు, నగర అధ్యక్షులు శ్రీనివాసరావు

ఏలూరు టౌన్ : దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఏపీలో బీసీలకు రాజ్యాధికారం దిశగా విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీ వర్గాలన్నీ అండగా ఉంటాయనీ, రాబోయే 2024 ఎన్నికల్లో బీసీలంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటారని పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు అన్నారు. ఏలూరు ఆర్ఆర్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు రాజకీయ రంగంలో సముచిత స్థానం కల్పిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తోన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్‌కు లేదన్నారు. జిల్లాల్లో పర్యటనల నేపథ్యంలో పవన్‌కళ్యాణ్ ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా, వైషమ్యాలు సృష్టించేలా ప్రసంగాలు చేయటం సరికాదని విమర్శించారు. రాజకీయంగా ఎంతో చైతన్యవంతులైన పూర్వ ఉభయగోదావరి జిల్లాల ప్రజల వద్ద మీ పప్పులు ఏమీ ఉడకవన్నారు. ముఖ్యమంత్రి పీఠం పవన్ కళ్యాణ్ కలలు కంటున్నారని, అవి ఎప్పటికీ నిజం కావనీ, కల్లలు గానే మిగిలిపోతాయని అన్నారు. మిమ్మల్ని నమ్మేందుకు రాష్ట్రంలో ఏ సామాజికవర్గం సిద్ధంగా లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందే బీసీ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. నలుగురు బీసీలను రాజ్యసభకు పంపిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ మాత్రమే అన్నారు. ఎమ్మెల్సీలుగా, కార్పొరేషన్ ఛైర్మన్లు, మేయర్లు, స్థానిక సంస్థల్లోనూ 52శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసిన గొప్ప నాయకుడు ఆయనే అన్నారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి పదేళ్లు దాటినా కనీసం ఎమ్మెల్యేగా కూడా నెగ్గలేని దయనీయ స్థితిలో ఉండడం సిగ్గుచేటన్నారు. రాజకీయ పార్టీని స్థాపించి కనీసం ఒక విధి విధానం లేకుండా గాలికి కొట్టుకుపోవటం మీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆళ్లనాని సారథ్యంలో జిల్లాలోని ఏలూరు పార్లమెంట్‌తోపాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను భారీ మెజార్టీతోనే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ మాట్లాడుతూ గోదావరి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడేలా చేస్తామనీ, దమ్ముంటే పవన్‌కళ్యాణ్ పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. సమావేశంలో పార్టీ నాయకులు కిలాడి దుర్గారావు, ఎస్సీ విభాగం అధ్యక్షులు తేరా ఆనంద్, పుప్పాల గోపి, పిల్లా చరణ్, రాజా అహ్మద్, పడమటి గిరిబాబు, చిక్కాల దుర్గారావు తదితరులు ఉన్నారు.

మోదీ పాలనకు మద్దతు తెలపాలి

ఏలూరు (టూటౌన్): దేశంలో తొమ్మిదేళ్లుగా అవినీతి రహిత పరిపాలన అందించిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందని బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. స్థానిక కొత్తపేట 43వ డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం గృహసంపర్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గారపాటి చౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నరేంద్ర మోదీ పాలనకు మద్దతు తెలపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి చేసిన కేటాయింపుల గురించి వివరించి మోదీ పాలనపై ప్రచురించిన కరపత్రాలను అందజేసారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పొన్నాల లక్ష్మి సంతోషిని, ఏలూరు నియోజకవర్గ కో–కన్వీనర్ బాడిత నారాయణరావు, వివిధ మండల కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.